ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

గురువారం 10 జూలై 2025

రైతు బజార్‌ను వినియోగించుకోవాలి

సిరిసిల్ల టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌ను వినియోగించుకోవాలని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం ఒక ప్రకటనలో తెలిపారు. కూరగాయల వ్యాపారులను రైతు బజారులోకి తరలించడానికి అవసరమైన షెడ్ల నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. ఆదే విధంగా రైతు బజారులోకి మటన్, చేపల విక్రయించడానికి రైతు బజార్‌లో అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రోడ్ల పక్కన మటన్, చేపల విక్రయాలు చేయకూడదని వ్యాపారులు, వినియోగదారులు ప్రజలు సహకరించాలని కోరారు.



'సర్దుబాటు'కు కసరత్తు..



- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపు
- కలెక్టర్ ఆమోదంతో బదిలీలు.. ఈనెల 15లోపు ప్రక్రియ పూర్తి
- జిల్లాలో 489 పాఠశాలలు.. 2,073 మంది ఉపాధ్యాయులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సర్కారు బడుల్లో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండి.. సరిపడా ఉపాధ్యాయులు లేని చోట ఇతర పాఠశాల నుంచి సర్దుబాటు చేసే ప్రక్రియకు కసరత్తు ప్రారంభించారు. ఇందుకు అనుగుణంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు క్షేత్ర స్థాయిలో సేకరిస్తున్నారు.

విద్యాసంవత్సరం ప్రారంభం కంటే ముందే ప్రభుత్వం సర్దు బాటు పూర్తిచేసే విధంగా ఆదేశాలు ఇచ్చింది. ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత రావడంతో సర్దుబా టును వాయిదా వేసింది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు అవుతున్న క్రమంలో తాజాగా ఈనెల 15లోగా ఉపాధ్యాయుల సర్దు బాటు ప్రక్రియ పూర్తిచేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. రెండు మూడు రోజుల్లోనే కలెక్టర్ ఆమోదంతో బదిలీల ప్రక్రియ పూర్తికానుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 489 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 337 ప్రాథమిక పాఠశాలలు, 38ప్రాథమికోన్నత పాఠశాల లు, 114 ఉన్నత పాఠశాలలో ఉన్నాయి. పాఠశా లల్లో 2073మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 750మంది, ప్రాథమి కోన్నత పాఠశాలల్లో 167మంది, ఉన్నత పాఠ శాలల్లో 1156మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 31536మంది విద్యార్థులు చదువుతున్నారు.

పాఠశాల కేటగిరి	పాఠశాలల సంఖ్య	విద్యార్థులు	బాలురు	బాలికలు
ప్రాథమిక పాఠశాలలు	337	14,371	7,108	7,263
ప్రాథమికోన్నత పాఠశాలు	38	2,055	1,057	998
ఉన్నత పాఠశాలు	114	15,110	8,229	6,881
మొత్తం	489	31,536	16,394	15,142

గత విద్యా సంవత్సరంలో 140 మంది..

జిల్లాలో 167 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఉన్న విద్యార్థులకు అనుగుణంగా టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. తాత్కాలిక సర్దుబాటుపై ఉపాధ్యాయులను ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు. గత సంవత్సరం 140మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. తాజాగా వివరాలు సేకరిస్తున్నారు. దానికిఅనుగుణంగా ఈసారి... మిగతా 8లో

సర్దుబాటుపై వివాదం..

ఉపాధ్యాయులు సర్దుబాటుపై ఉపాధ్యాయసంఘాలు, ఉపాధ్యాయులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక పాఠశాలలో 60 మంది విద్యార్థులు ఉంటే వారికి విద్యాబోధన చేసేం దుకు ఇద్దరు ఉపాధ్యాయులతో ఒకటి నుంచి ఐదోతరగతి వరకు 18సబ్జెక్టులు ఇద్దరూ ఎలా బోధిస్తారని సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. బోజనంతో పాటు విద్యా ర్థులకు సంబంధించిన రిపోర్టులు, నివేదికలు తయారు చేయాల్సి ఉంటుందని, ఇద్దరు ఉపాధ్యాయులతో ఇతర పనులు ఎలా సాధ్యమవుతుందని అంటున్నారు. విద్యార్థి నిష్పత్తి 1:20 ఉండే విధంగా సర్దుబాటు చేయాలని, 60మందికి పైగా విద్యార్థులు ఉంటే ప్రతితరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్య లు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

ఐకేపీ సెంటర్ కబ్జాకు ప్రయత్నాలు

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు



ఫిర్యాదు చేయడానికి వచ్చిన వెంకట్రావ్‌పల్లి గ్రామస్థులు

సిరిసిల్ల టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఐకేపీ సెంటర్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని బుధవారం ముస్తాబాద్ మండలం వెంకట్రావ్‌పల్లి గ్రామస్తులు, రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముస్తాబాద్ మండలం, వెంకట్రావ్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 798 ప్రభుత్వ భూమిలో గత ప్రభుత్వం ఐకేసీ సెంటర్‌ను నిర్మించడం జరిగిందన్నారు. పది సంవత్సరాల కాలంగా ఐకేపీ సెంటర్ కొనసాగుతుందని కొందరు ఐకేసీ సెంటర్‌ను కబ్జా చేయాలని చూస్తున్నారని కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ, సామాజిక సమస్యలపై ఉద్యమం

- ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ ప్రముఖ్ అన్నందాస్‌మురళి



సిరిసిల్లలో ఏబీవీపీ అవిర్భావ ర్యాలీ

సిరిసిల్ల రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత విద్యార్థి పరిషత్ విద్యారంగ సమస్యలే కాకుండా సామాజిక రాజకీయ సమస్యలపై ఉద్యమిస్తూ జాతిని జాగృతం చేస్తుందని కరీంనగర్ విభాగ్ ప్రముఖ్ అన్నందాస్‌మురళి అన్నారు. సిరిసిల్ల పట్టణంలో బుధవారం ఏబీవీపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూనియర్ కళాశాల మైదానం నుంచి అంబేద్కర్ చౌరస్తావరకు విద్యార్థులతో ర్యాలీ తీశారు. ఈసందర్భంగా ఏబీవీపీ జెండాను జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అన్నందాస్ మురళి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి ఎలగందుల శ్రీనివాస్,ఝాన్సీ, రుద్రవీణ, ధనూష్, పులి రంజిత్ సామన పల్లి ప్రశాంత్, అక్కెం నాగరాజు, రిషి, శివ, కార్తీక్, జింక అనిల్, మారవేణి రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

వివాదాలను కౌన్సెలింగ్‌లో పరిష్కరించుకోవాలి

సిరిసిల్ల రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : భార్యభర్తల మధ్య తరచూ జరుగుతున్న గొడవలను ఫ్యామిలీ కౌన్సెలింగ్‌లో పరిష్కరించుకుని కుటుంబాలను పోషించుకోవాలని సైకాలజిస్ట్ పున్నంచందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని కార్మిక క్షేత్రమైన బీవైనగర్‌లో బుధవారం చేనేత జౌళీశాఖ, మైండ్‌కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్‌ల ఆధ్వర్యంలో కార్మిక కుటుంబాలకు భార్యభర్తల వివాదాలపై మనోవికాస సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ భార్యభర్తల మధ్య వివాదాలకు ప్రధాన కారణం పరస్పర అర్థం చేసుకోలేకపోవడమేనని అన్నారు. ఫ్యామిలి కౌన్సెలింగ్ ద్వారానే ఈ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకోవచ్చన్నారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ కోసం మైండ్‌కేర్ సెంటర్‌లో తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, కొండ ఉమ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట జేఏసీ నాయకుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏ జేఏసీ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామపరిపాలన అధికారి నియామకాల్లో జీవో 81 ప్రకారం వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందని ఆ హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి వీఆర్ఏ వారసులకు న్యాయం చేయాలంటూ కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ వారసులు కొరెం రమేష్ పటేల్, పిట్ల రవి, నిమ్మల బాలరాజు, అనిల్, ఆగయ్య, తోట హరీష్ శ్రీనివాస్, కోల పర్శరాములు, ఎండి జలీల్, యాదగిరి, నాగారపు స్వామి, జక్కుల నర్సింలు, క్యారం దేవదాస్, రాజయ్య, సునిత, శృతి, పుల్కం శ్రీనివాస్, మూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల బహిరంగ వేలం

కోనరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వాహనాలను బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో నేడు వాహనాలను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ వేలంలో ఉదయం 10 గంటలకు హాజరై వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

విద్యాధికారి కార్యాలయంలో మండల పరిషత్ సేవలు
- పాఠశాల గదిలో ఎంఈవో విధులు
- సిబ్బందికి, ఉపాధ్యాయులకు ఇబ్బందులు
7

పత్తి సాగుపైనే రైతుల ఆసక్తి..
- ఇల్లంతకుంట మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం
8

వేములవాడ అభివృద్ధికి కృషి

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాలుగా వెనుకబడిన వేములవాడ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని 19,20, 21, 22 వార్డుల్లో సుమారు 54లక్షల రూపాయల అంచనా వ్యయంతో సైడ్ డ్రైన్, సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణనికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని, గుడి చెరువులో, మూల వాగులో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో రెండుసార్లు వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్‌గా పనిచేసి, ప్రస్తుతం ఎమ్మెల్యేగా, రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా ఆలయ అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలు చేపట్టడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా వందకోట్లు కేటాయిస్తామని గత ప్రభుత్వం మోసం చేసిందని, గతంలో తండ్రీకొడుకులు ఎమ్మెల్యే పదవిని తమ హోదాకు గుర్తుగా, పరపతిని పెంచుకోవడం కోసం మాత్రమే వాడుకున్నారని, ప్రజల కోసం ఏమాత్రం పనిచేయలేదని, ఫలితంగా ఈ ప్రాంతం అన్ని రకాలుగా వెనుకబడిపోయిందన్నారు. వేములవాడ ఆలయం, పట్టణ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్, పదిలక్షల రూపాయల ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని సుభాష్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని ఆయన పరిశీలించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, సెస్ డైరెక్టర్ నామాల ఉమ, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకోవాలి : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతీ ఒక్కరు ఆధార్ కార్డులో వివరాలు, బయోమెట్రిక్‌లను అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్‌బీగితే కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంతృప్తి పద్ధతిలో పౌరులందరికి తప్పనిసరిగా ఆధార్‌కార్డు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ప్రసవాల వివరాలు ఈ బర్త్ పోర్టల్‌లో నమోదు చేయాలని కోరారు. ప్రతి 10వేల జనాభాకు ఒక సీఎస్‌సీ సెంటరలను ఏర్పాటు చేయాలని వారంలో అదనంగా మరో 36 సీఎస్‌సీ సెంటర్‌ల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేయాలని, ప్రస్తుతం ఉన్న కొన్ని సెంటర్‌లను మార్చాలని సూచించారు. జిల్లాలో 5నుంచి 15 సంవత్సరాలలోపు గల 27వేలకుపైగా ఉన్న జనాభాకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని కోరారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆధార్‌బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన క్యాంపులను ప్రతి 6నెలలకు ఒకసారి ఏర్పాటుచేయాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారి మాట్లాడుతూ 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ కార్డులు అందేలా చూడాలన్నారు. 18సంవత్సరాలు దాటిన వారికి అధార్ నమోదుకు సంబంధించి తహసీల్దార్ లాగిన్‌లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కారించాలని కోరారు. మండల కేంద్రాల్లో ఆధార్‌కార్డు వివరాల అప్‌డేట్ చేసేందుకు ప్రత్యేక క్యాంపుల ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను తయారుచేయాలని అదేశించారు. జిల్లాలో మీ సేవా కేంద్రాల్లో అధార్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోస్టల్ కార్యాలయం నుంచి ఎన్ని అధార్‌కార్డులు తప్పుడు అడ్రాస్‌ల కారణంగా వెనక్కి వచ్చాయో వివరాలు అందించాలన్నారు. జిల్లాలోని వివిధ అనాధ శరణాలయాల్లో పెరుగుతున్న వారికి అధార్ ఎన్‌రోల్మేంట్‌లో వచ్చే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో యూఐడీఏఐ ప్రాజెక్టు మేనేజర్ నరేష్‌చంద్ర, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్‌కుమార్, జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత, ఈడిఎం శ్రీనివాస్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లిఖార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక క్షేత్రంలో హోరెత్తిన నిరసనలు



సిరిసిల్లలో ర్యాలీ



సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

సిరిసిల్ల టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం కార్మిక క్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వామపక్షాలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల సంయుక్తంగా నిర్వహించిన నిరసనలు హోరెత్తాయి. జిల్లా కేంద్రం తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఆర్డీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రామయ్య, జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఎపీఐ జిల్లా కార్యదర్శి సుదర్శన్, పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకురాలు గొట్టె రుక్మిణి, నాయకులు మీసం లక్ష్మన్, సోమిశెట్టి దశరథం, ఆకుల రాములు, జిందం ప్రసాద్, వంగల శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, బొప్ప దేవయ్య, గోనె ఎల్లప్ప, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయం ఎదుట...

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఇన్సూరెన్స్ కార్పోరేష్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల శాఖ 3వ తరగతి ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియర్ కార్యదర్శి రాపెల్లి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, ప్రణీత్, మల్లేశం, దినకర్, నరసింహారెడ్డి, హరీష్, శరత్ కావ్య, స్రవంతి, శివాని, కరుణాకర్ పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులను త్వరగా పూర్తిచేయాలి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

బోయినపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బోయినిపల్లి దారిలో స్తంభంపల్లి గ్రామశివారులో బ్రిడ్జి పనులను త్వరగా పూర్తిచేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోగల స్తంభంపెల్లి గ్రామ శివారులో అసంపూర్తిగా నిలిచిన బ్రిడ్జి పనులను బుధవారం ఎమ్మెల్యే మేడి పల్లి సత్యంతోపాటు, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలు కలిసి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రయాణీకులకు అందుబాటులోకి తీసుకవచ్చేలా చూడాలని సూచించారు. పనులు వేగవంతం చేసి నిరంతరం పర్య వేక్షించాలని పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డిని ఆదేశించారు.

తరగతి గదులు నిర్మించాలి..

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు పరిశీలించారు. పదవ తరగతి గదిని సందర్శించి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కిచెన్ స్టోర్‌రూం, మధ్యాహ్న భోజన తయారీ తీరును పరిశీలించారు. భవనం మొదటి అంతస్తులో రూ.8లక్షలతో రెండు తరగతిగదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని పంచాయతీ ఈఈని ఆదేశించారు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

కొదురుపాక దారిలో ఉన్న రెండులో లెవల్ కల్వర్టులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు పరిశీలించారు. ప్రయాణీకుల ఇబ్బందులు తల్తెకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో జయశీల, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, వైస్‌చైర్మన్ వినోద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగుల కనుకయ్య, కొడిగాని వెంకటేశ్ నాగు వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాలకు వేలం

ఎల్లారెడ్డిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ కార్యాల యం పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల10న వేలం పాటలు నిర్వహించనున్నామని ఆ శాఖ సీఐ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలి పారు. వేలంపాటల్లో పాల్గొనే వారు ఉదయం 10 గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని పేర్కొన్నారు. మొత్తం 7 వాహనాలకు వేలం పాటలు నిర్వహించనున్నామని సీఐ తెలిపారు.

పేదలకు నీడ కల్పించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నీడలేని నిరుపేదలకు గూడు కల్పిం చడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు కో-కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండలింగంపల్లిలో కొనసాగుతు న్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ నడిపిన రైతుకు జరిమానా



కేజీవీల్ ట్రాక్టర్‌తో రైతు

ఎలిగేడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీశ్రీనగర్ ప్రాంతంలో కేజీవీల్ ట్రాక్టర్‌ను రోడ్డుపై నడుపుతున్న మండల చిన్నగట్టయ్యకు రూ.5వేల జరిమానాను విధించినట్లు తహసీల్దార్ యాకయ్య తెలిపారు. బుధవారం ఎస్‌ఐ సత్యనారాయణ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో నిబంధనలను అతిక్రమించి గట్టయ్య ట్రాక్టర్‌కు కేజ్‌వీల్స్ ఉపయోగించి నడిపించినట్లు తెలిపారు. దీంతో అతనితోపాటు ట్రాక్టర్‌నుపోలీస్‌స్టేషన్‌కు తరలించి, అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆదివారంపేట్‌లో ఒకరికి..

రామగిరి: ఆదివారంపేట్‌లో సీసీ రోడ్లపై కేజ్‌వీల్స్‌తో నడిచిన ట్రాక్టర్‌కు జరిమానా విధించారు. బుధవారం ఎంపీడీవో శైలజారాణి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సందర్భంగా గ్రామానికి చెందిన ఎలువాక లక్ష్మయ్యకు చెందిన కేజీవీల్ ట్రాక్టర్ రోడ్డుపై వెళ్తుండగా గమనించిన ఎంపీడీవో రూ.2వేల జరిమానా విధించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులకు జరిమానా

శంకరపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులకు బుధవారం జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 10మందిని హుజూరాబాద్ సెకండ్‌క్లాస్ స్పెషల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రూ.11వేల జరిమానా విధించారు.

పైపులు, సర్వీస్ వైర్ ఎత్తుకెళ్లిన దుండగులు

శంకరపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోని ఎండీ అలీమోద్దీన్ వ్యవసాయ బావి విద్యుత్‌మోటర్‌కు అమర్చిన పైపులు, సర్వీస్‌వైర్‌తోపాటు అక్కడేఉన్న ప్లాస్టిక్ తట్టాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించగా, బ్లూకోట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

చందుర్తి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలకేంద్రానికి చెందిన సుందరమ్మ, నాగమల్లేశం, బాబుతోపాటు మరో ఇద్దరిని పిచ్చి కుక్కదాడి చేసి గాయపరిచింది. అలాగే మరోవ్యక్తిని కోతి దాడిచేసి గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. ప్రజలపై పిచ్చికుక్కలు దాడి చేస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యువతి అదృశ్యం

మల్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం సర్వాపూర్‌లో చందుర్తి మండలం మూడపల్లికి చెందిన బైరోజు రమ్య అలియాస్ లావణ్య(27) అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. రమ్య తండ్రి నర్సయ్య కుటుంబసభ్యులు జీవనోపాధిలో భాగంగా సోమవారం సర్వాపూర్‌కు బాసోజిరాజేశం ఇంటికి వచ్చారు. మంగళవారం సైకిల్‌పై బయటకు వెళ్లగా తిరిగి ఇంటికిరాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో రమ్య తండ్రి నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అరచేతిలో రైల్వే సమాచారం



- రైల్‌వన్ పేరిట భారత రైల్వే శాఖ ప్రత్యేక యాప్
- ఈ నెల ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి

కరీంనగర్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం భారత రైల్వే శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రైళ్లకు సంబంధించిన పూర్తి సమాచారం ఒకే చోట లభించే విధంగా యాప్‌ను తీసుకొచ్చింది. రైల్‌వన్ పేరిట ఉండే యాప్‌ను ఈ నెల ఒకటో తేదీన అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో టికెట్ల బుకింగ్ నుంచి ట్రైన్ స్థితిగతులు, భోజన వసతి వంటి పూర్తి సమాచారం లభిస్తాయి. ముఖ్యంగా రైల్వే టికెట్లు యాప్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చు. అత్యవసరమయ్యే అన్ రిజర్వుడ్ టికెట్లు కూడా వెంటనే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ప్లాట్ ఫామ్ టికెట్లు సైతం పొందవచ్చు. మనం వెళ్లాల్సిన ప్రాంతానికి ఏ రైళ్లు అందుబాటులో ఉన్నాయని వెతికేందుకు సర్చ్ ట్రైన్స్ బటన్ ఉంటుంది. ఏ ప్లాట్ ఫామ్‌పై రైలు ఆగుతుంది, కోచ్ పొజిషన్ ఎక్కడ ఉందో కూడా తెలుసు కోవచ్చు. రైలు ఎక్కడ ఉంది, ఎప్పుడు వస్తుంది అనే విషయాన్ని ట్రాక్ యువర్ ట్రైన్ ద్వారా తెలుసుకోవచ్చు.

● పీఎన్ఆర్ సమాచారం

రిజర్వేషన్‌కు సంబంధించి ఇందులో పీఎన్ఆర్ స్థితిని తెలుసుకోవడానికి అవకాశం కల్పించారు. ముందస్తు రిజర్వేషన్ టికెట్ స్థితి, సీటు కన్ఫర్మేషన్ స్టేటస్, రైలు రద్దు, రిజర్వేషన్ రద్దు వంటి తదితర అంశాలను తెలుసుకోవచ్చు.

● ఇష్టమైన ఆహారం

మనకు ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ చేసుకునేలా యాప్‌లో అవకాశం కల్పించారు. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరి జం ద్వారా వివిధ రైల్వే స్టేషన్లకు చేరుకునేందుకు ముందే నచ్చిన ఆహారాన్ని ఆర్డర్ చేసుకుంటే మీరు ప్రయాణిస్తున్న రైలులో మీ సీటు వద్దకే ఆహారాన్ని తీసుకొచ్చి ఇస్తారు.

● రైల్ మదత్

సూచనలు ఇవ్వాలన్నా, రైళ్లలో సమస్యలు తలెత్తినా ఫిర్యాదు చేయడానికి రైల్ మదత్ విభాగం అందుబాటులో ఉంది. ఇందులో ఫిర్యాదు చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయి. రైలులోగానీ, స్టేషన్‌లో గానీ ఎక్కువ రేట్లకు అమ్మకాలు జరిపినా ఫిర్యాదు చేయవచ్చు.

● యాప్ డౌన్‌లోడ్ ఇలా

సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేయాలి. తర్వాత సెల్ నంబరు లేదా మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పాస్‌వర్డుతో లాగిన్ అవ్వాలి.

ఆరు నెలలకు రెట్టింపు డబ్బుల పేరిట మోసం

- ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తమ సంస్థలో పెట్టుబడి పెడితే ఆరు నెలలకు రెట్టింపు డబ్బులు ఇస్తామని చెప్పి ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇచ్చి కోటి రూపాయల వరకు వసూలు చేశారు. చివరికి మోసం చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో పోలీసులు ఒకరిని అరెస్టుచేసి కరీంనగర్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన గంటల నవీన్, నజీర్ గోల్డ్ ఫైనాన్స్, స్క్రాప్ బిజినెస్‌లో పెట్టుబడి పెడితే ఆరు నెలల్లో రెట్టింపు డబ్బులు ఇస్తామని ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇచ్చారు. ఈ ప్రకటనలకు ఆకర్షితులైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు దాదాపు కోటి రూపాయల వరకు డబ్బులు పెట్టుబడి రూపంలో ఆ సంస్థ ఖాతాకు పంపించారు. ప్రారంభంలో ఒకరిద్దరికి చిన్న మొత్తంలో ఆరు నెలల్లో రెట్టింపు డబ్బులు ఇచ్చారు. దీంతో చాలామంది పెట్టుబడి పెట్టారు. పెట్టుబడి పెట్టినవారిని గోవా టూర్‌కు కూడా తీసుకెళ్లారు. కొద్దిరోజుల తరువాత ఆ సంస్థను మూసివేసిన నవీన్, నజీర్ పెట్టుబడిదారులకు డబ్బులు చెల్లించకుండా మోసం చేశారు. దీనిపై కరీంనగర్ జిల్లాకు చెందిన ముగ్గురు బాధితులు స్థానిక సైబర్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే ఇదే మోసానికి సంబంధించి నవీన్, నజీర్‌పై ఖమ్మంలో రెండుకేసులు నమోదయ్యాయి. కరీంనగర్‌లో తాజాగా సైబర్‌క్రైంపోలీసులు నవీన్, నజీర్‌తోపాటు ఖమ్మంకు చెందిన రాంచంద్రమూర్తిపై కూడా కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నజీర్ పరారీలో ఉన్నాడు. రాంచంద్రమూర్తి బ్యాంక్ ఖాతాలోకి రెండు విడతలుగా 10లక్షల రూపాయలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. నవీన్‌తో రాంచంద్రమూర్తి గోవాటూర్‌కు వెళ్లినట్లుగా సైబర్‌పోలీసుల విచారణలో తేలింది. దీంతోపాటు అతడి ఖాతాలో ఏడాదిగా రూ.కోటి 80 లక్షల వరకు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు రాంచంద్రమూర్తిని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు ఖమ్మంలో అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న బీఆర్ఎస్ పెద్దలు

- కరీంనగర్ పార్లమెంటు కోకన్వీనర్ చక్రధర్‌రెడ్డి

గంభీరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజానాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్‌ప్రభుత్వంపై బీఆర్ఎస్‌పార్టీ పెద్దలు విషం చిమ్ముతున్నారని కరీంనగర్ పార్లమెంటు కోకన్వీనర్ కన్నమనేని చక్రధర్‌రెడ్డి ఆరోపించారు. గంభీరావుపేట మండలకేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి, బీఆర్ఎస్ పార్టీ పెద్దల తీరుపై మండిపడ్డారు. ప్రతిపక్షనేతలు అసెంబ్లీకి వచ్చి సమస్యలపై చర్చించే వీలుండగా, వేదికలపై లేనిపోని సవాళ్లుచేయడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికసంక్షోభంలో నెట్టి, నేడునీతి మాటలు వల్లించటాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్థికసంక్షోభాన్ని అధిగమించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తూ, మరోవైపు మేనిఫెస్టోలో పెట్టిన ప్రజాసంక్షేమ పథకాలను దశలవారీగా అమలు చేస్తున్నాడన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రైతుల పక్షపాతిగా సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషిచేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ పెద్దలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. కార్‌రేస్, మద్యం కుంబకోణాల్లో కూరుకు పోయిన బీఆర్ఎస్ పెద్దలు నీతులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ముస్తాబాద్ మండల మాజీ ఏఎంసీ చైర్మెన్ అంజన్‌రావు, జిల్లాఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, సోషల్‌మీడియా ఇన్‌చార్జీ గౌరిశంకర్, మాజీసర్పంచ్ భూమరాజం, ఫాక్స్‌డైరెక్టర్లు అంజిరెడ్డి, నర్సింలు, తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయికన్వెన్షన్ హాల్లో పేకాడుతున్న 11మందిని పోలీసులు అరెస్టుచేశారు. తమకు అందినసమాచారం మేరకు సాయికన్వెన్షన్ హాల్‌పై దాడిచేశామని సీఐ కరుణాకర్ తెలిపారు. 11మందిని అరెస్టుచేసి వారినుంచి 19వేలనగదు, 11సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

16 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

గణేశ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి కరీంనగర్ సర్కిల్ పరిధిలో 16 సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మేక రమేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సబ్‌స్టేషన్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా అవసరం ఉన్నమేరకు కొత్తగా సబ్‌స్టేషన్ల నిర్మిస్తున్నామని, భవిష్యత్తులో ఎటువంటి లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. విద్యుత్ పంపిణీ మరింత మెరుగుపడుతుందని వివరించారు. ఈసబ్‌స్టేషన్లలో ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. రియల్‌టైం ఫీడర్‌మానిటర్ ఉంటుందని, విద్యుత్ సంబంధిత పూర్తి సమాచారం తెలుసుకునే వీలుంటుందని తెలిపారు.



కరీంనగర్ సర్కిల్‌లో నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

చెక్ బౌన్స్ కేసులో 18 నెలల జైలు

సిరిసిల్లక్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో ముద్దాయికి 18నెలల జైలుశిక్ష విధిస్తూ బుధవారం సిరిసిల్ల ప్రథమశ్రేణిన్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారు. కోర్టుఆర్డర్ వివరాల ప్రకారం.. సిరిసిల్లకుచెందిన ఎ లక్ష్మీనారాయణకు 2017లో కోడంనరేశ్ రూ.11.50 లక్షలు అప్పుఇచ్చి చెక్కు తీసుకున్నాడు. అనంతరం చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్‌అయింది. దీంతో బాధితుడు నరేశ్ న్యాయవాది లక్కం కిషోర్ ద్వారా సిరిసిల్ల కోర్టులో కేసు దాఖలు చేశాడు. ఈకేసును విచారించిన మెజిస్ట్రేట్ అప్పు తీసుకున్న లక్ష్మీనారాయణకు 18నెలల జైలుశిక్షతోపాటు రూ.15లక్షలు నరేశ్‌కు చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

ప్రమాదకరంగా వంతెనలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మానకొండూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామశివారు నుంచి జమ్మికుంట వరకు సాగునీటి సరఫరా చేస్తున్న డీబీఎం 6 ఉపకాల్వ వంతెనలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ కాల్వకు ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు విరిగిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ప్రయాణికులకు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కరీంనగర్ నుంచి జమ్మికుంట ప్రధాన రహదారి వెంబడి నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, వందలాది ద్విచక్రవాహనాలు నడుస్తుంటాయి. ఈ కాల్వపై వంతెన రక్షణ గోడలు కూలి పోయి నాలుగేళ్లు గడుస్తున్నా అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతు చేపట్టడం లేదు. దీంతోపాటు లలితాపూర్-దేవంపల్లి కాల్వ వంతెన సైతం శిథిలావస్థకు చేరుకుంది. ఎల్ఎండీ నుంచి నీటి సరఫరా చేసే సమయంలో వరద తాకిడికి గురవుతూ మరింత శిథిలావస్థకు చేరుకుంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పోచంపల్లి వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన

వలస కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఏసు బుధవారం పురుగుల మందు తాగాడని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి పరిస్థితి విషమంగా ఉందన్నారు. వారి కథనం మేరకు.. ఏసు పదిహేనేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లారెడ్డిపేటకు వలస వచ్చాడు. స్థానికంగా భవన నిర్మాణ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సరైన పనులు లభించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబంలో గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఏసు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు మొదట సిరిసిల్లకు తరలించారు. అక్కడనుంచి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఏసు పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన గొడిసల గట్టయ్య(49) అనేవ్యక్తి సోమవారం కొండగట్టులో పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకోగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు గలరు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

జగిత్యాలరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం మోతె గ్రామానికి చెందిన చందుకుమార్(22) అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. చందుకుమార్ కొన్నిరోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఒంటరితనంతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్రంగా మనస్థాపం చెంది ఈనెల6న మోతె నల్లగుట్ట శివారులో పురుగులమందు తాగగా బంధువులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి



శ్రీకాంత్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీడ్రైవర్ మృతిచెందిన ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని ఇదులాపూర్ గ్రామశివారులో రెండుద్విచక్ర వాహనాలు ఢీకొనగా, జాఫర్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన తోట శ్రీకాంత్(32) అక్కడిక్కడే మృతి చెందాడు. కాగా శ్రీకాంత్ ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికివస్తుండగా మార్గ మధ్యలో ఈప్రమాదం జరిగింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక క్వారీలో పని కల్పించాలి



పోలీసులకు ఫిర్యాదు అందజేస్తున్న హిమ్మత్‌నగర్ గ్రామస్థులు

వీణవంక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామస్థులు కొండపాక ఇసుక క్వారీలో లారీలపై పరదలు కప్పే ఉపాధి తమకు కల్పించాలని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లేని పక్షంలో గ్రామంలో చేపట్టే రిలే నిరాహార దీక్షలకు అనుమతి ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ గ్రామంలోని నల్లకుంట కట్టపై నుంచి రోజు వందలాది లారీలు వెళ్తుండడంతో రోడ్డు ధ్వంసం అవడంతోపాటు ప్రజలకు రాక పోకలకు ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో గెల్లు మల్లయ్య, నల్ల తిరుపతిరెడ్డి, రమేష్, తిరుపతిరెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, రాజు, సమ్మయ్య తదితరులున్నారు.

ఇసుక లారీ పట్టివేత



పోలీసులు అదుపులోకి తీసుకున్న ఇసుక లారీ

వేములవాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేటు మార్చివేసి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని వేములవాడ పట్టణ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని వీణవంక మండలం కొండపాక ఇసుక రీచ్ నుంచి టిజి 23 టి 1225 నంబర్‌గల వాహనానికి ఇసుక రవాణా కోసం వేబిల్‌తో కూడిన అనుమతి ఉండగా, పోలీసుల తనిఖీలలో లారీ రిజిస్ట్రేషన్ నంబర్‌కు ఇంజన్, చాసిస్ నంబర్‌కు మధ్య తేడా ఉన్నట్లు గుర్తించి లారీని స్వాధీనం చేసుకొని స్థానిక బస్ డిపోకు తరలించారు. ఈ విషయమై వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ వివరణ కోరగా, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, పూర్తి విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులకు యేటా ప్రమోషన్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు నరేందర్‌రావు

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యా యులకు యేటా బదిలీలు, ప్రమోషన్లు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని పలు పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రిటైర్‌మెంట్ల నేపథ్యంలో వందలాదిగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అవుతున్నాయన్నారు. పాఠశాలల్లో బోధనకు ఆటంకం కలగకుండా ప్రతిఏటా బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించడానికి వేసవి సెలవులలో పూర్తిచేసేలా ఒక క్యాలెండర్‌ను రూపొందించాలని ఆయన అన్నారు. అవసరమైతే నెల వారి ప్రమోషన్లు ఇవ్వాలని సూచించారు. దీనివల్ల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుందని అన్నారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తపస్ జగిత్యాలజిల్లా అధ్యక్షులు బొనగిరి దేవయ్య, కార్యదర్శి సురేందర్, పట్టణ కార్యదర్శి కట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ఎంపై సస్పెన్షన్ వేటు

కథలాపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో నాలుగు రోజుల కిందట ఇప్పపల్లికి చెందిన హామ్యానాయక్ అనే రైతు ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుదాఘాతంకు గురైన ఘటనలో జేఎల్ఎంను బాధ్యుడిగా చేస్తూ సస్పె న్షన్ వేటువేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ వేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో రైతు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఏడీఈ రఘుపతి విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జేఎల్ఎంను సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్టు అంబారిపేట సబ్ ఇంజినీర్ భరత్ తెలిపారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

కరీంనగర్ క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మారుతినగర్‌లో బుధవారం వేకువజామున 4గంటలకు ఓ ఇంట్లోకి చొరబడి మహిళ మెడలో నుంచి దొంగ బంగారుగొలుసు తెంపుకొని పారిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలు, ఆమె సోదరి అంజలి కరీంనగర్ వెంకటేశ్వరస్వామిగుడి ఎదురుగా మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. తెల్లవారుజామున 3:30గంటల సమయంలో అంజలి ఆటోలో ముందుగా మార్కెట్‌కి వెళ్లింది. 4 గంటల సమయంలో దొంగ ఇంట్లోకి ప్రవేశించి స్వరూపముఖంపై దిండుతో అదిమిపట్టి ఆమె మెడలో ఉన్న రెండు వరుసల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బాధితురాలు వెంటనే అప్రమత్తమై అతడిని వెంబడించినా ఫలితం లేకపోయింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.సీసీకెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ మూడోటౌన్ పోలీసులు తెలిపారు.

యువకులు సరైన మార్గంలో పయనించాలి

ఇల్లంతకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): యువకులు సరైన మార్గంలో పయనించాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంజాయికి బానిసలుగా మారడం వల్ల జీవితాలు రోడ్డున పడుతాయన్నారు. యువకులు వ్యసనాల బారినపడకుండా చదువుపై దృష్టి నిలపాలని, అప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండటంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతిరోజు వాహనాల తనిఖీలు కొనసాగుతాయని, డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలలో పట్టుబడితే జైలుకు వెళ్లవలసి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిత్యం గమనిస్తు ఉండాలని, ఏదైన తేడాగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

- వనమహోత్సవంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీవకోటికి ప్రాణాధారమైన మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం వనమహోత్సవంలో భాగంగా గంగాధర మార్కెట్‌యార్డు సమీపంలో ఆయన మొక్కలు నాటారు. అధికారులు, నాయకుల సమన్వయం, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో మొక్కలు నాటాలన్నారు. అనంతరం గంగాధర ప్రజాకార్యాలయంలో ఆర్థిక పునరావాసం స్కీంలో గర్షకుర్తి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మామిడిపల్లి విజయకు మంజూరైన రూ.50వేల చెక్కును ఆయన అందించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూలో సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు



పత్రాలను అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న టి.రాజేశ్వరి, రెడ్డవేణి భీమయ్యకు సూపరింటెండెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తూ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారిని వీసీ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ జె.రవికుమార్, సూపరింటెండెంట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు వై.కిషోర్, ప్రసాద్, ఓఎస్‌డీ హరికాంత్, సంతోష్, మారుతి, శ్రీకాంత్, మాధురి, సాయి, ఫసీయొద్దీన్, రమేష్, నర్సయ్య పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని గోదావరిఖని నుంచి వేములవాడకు పాదయాత్ర


వేములవాడకు పాదయాత్ర చేస్తున్న రవితేజ

సుల్తానాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురువాలని వేడుకుంటూ వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వరకు ఓ యువకుడు పాదయాత్ర చేపట్టాడు. గోదావరిఖని మార్కండేయనగర్‌కు చెందిన ముద్దమల్ల రవితేజ అనే యువకుడు ఓ ఎలక్ట్రానిక్ షాపులో గుమస్తాగా పని చేస్తున్నాడు. వారి స్వగ్రామం హుజురాబాద్ ప్రాంతం. వారి బంధువులు, గ్రామస్థులు వర్షాధారంగా వ్యవసాయం చేస్తుంటారు. జూన్ నెల మొదటి వారంలోనే పత్తి తదితర పంటలకు శ్రీకారం చుట్టి వరి నార్లు పోసుకున్నారు. వర్షాలు లేకపోవడంతో సాగు ఎలా అంటూ రైతన్నల ఆందోళనలు చెందుతున్నారు.

గోదావరిఖని నుంచి వేములవాడ వరకు 110 కిలో మీటర్ల దూరం ఉండగా మంగళవారం మధ్యాహ్నం గోదావరిఖని నుంచి బయలుదేరిన రవితేజ బుధవారం రాత్రి సుల్తానాబాద్ మండలం చిన్నకలువల గ్రామంలోని హన్‌మాన్ ఆలయంలో బస చేశాడు. ఉదయం పాదయాత్ర ప్రారంభించగా కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై విలేకరులతో మాట్లాడారు. వర్షాలు కురిపించాలని వేములవాడ రాజరాజేశ్వర స్వామిని వేడుకుంటు పాదయాత్ర చేస్తున్నట్లు రవితేజ తెలిపాడు. కరీంనగర్ మండలం ముగ్ధుంపూర్ వద్ద బుధవారం రాత్రి బస చేస్తానని, గురువారం రాత్రి వరకు వేములవాడ చేరుకుంటానని తెలిపారు.

ప్రాజెక్టులు వెలవెల

- వర్షాలు కురవక నిండని జలాశయాలు
- మందకొడిగా వ్యవసాయ పనులు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


ఎండిపోయిన రాజన్న సిరిసిల్లలోని మధ్య మానేరు రిజర్వాయర్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వర్షాకాలం సీజన్ ప్రారంభమై 40 రోజులు గడిచాయి. ఇప్పటి వరకు ఒక్క భారీ వర్షం కురవలేదు. దీంతో ప్రాజెక్టులు నీరు లేక వెలవెలబోతున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి భారీ వర్షాలు కురిశాయి. ఈ ఏడాది ఆలస్యం అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ బావుల కింద మాత్రమే వరినాట్లు వేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో అడపాదడపా కురిసిన వర్షాలతో ఆరుతడి పంటలను సాగు చేశారు. కానీ సరైన వర్షాలు లేక ఆ పంటలు ఎదగడం లేదు.

● ప్రాజెక్టుల వారీగా పరిస్థితి

ఉమ్మడి జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నామమాత్రంగా వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.22 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ప్రాజెక్టు నీటిమట్టం 60 టీఎంసీలకు చేరితేనే ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనల ప్రకారం ఆగస్టు 15లోపే వరినాట్లు వేస్తే మంచి దిగుబడులు వస్తాయి. కానీ వర్షాలు రాక వరద నీరు చేరడం లేదు.


ఎల్‌ఎండీలో తగ్గిన నీటి మట్టం

- శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.76 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు లక్ష ఎకరాలకు పైగా సాగునీటిని అందించాల్సి ఉంది. హైదరాబాద్ నగర ప్రజలకు, పెద్దపల్లి, రామగుండం, మంథని, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎన్టీపీసీ అవసరాలకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారానే నీటిని విడుదల చేస్తారు. వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టు నిండడం లేదు.

- రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని మధ్య మానేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 27.55 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.90 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి.

- కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 24.0 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.190 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తేనే ఈ ప్రాజెక్టులకు శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నంది మేడారంలోని నంది, గాయత్రి పంపు హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోస్తారు. శ్రీపాద ఎల్లంపల్లిలోకి ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షం నీటితోపాటు కడెం, ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటిమట్టంకు చేరుకున్న తర్వాత విడుదల చేసే అదనపు నీరు రావాల్సి ఉంటుంది.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గత ఏడాది జూలై 20 నాటికి పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నది. కృష్ణా నది తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా ఆ నదిపై నిర్మించిన అన్ని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. గోదావరి తీర ప్రాంతాల్లో వర్షాలు లేక ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. వర్షాలు కురవకపోతే ఈ వానాకాలం సీజన్‌కే కాకుండా యాసంగి సీజన్‌కు కూడా సాగునీటితోపాటు ఈ ప్రాంత ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. రైతులంతా వరుణుడి పైనే ఆశలు పెట్టుకున్నారు.

మొలకెత్తని పత్తి.. ముదురుతున్న నారు

- వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన
- నెల రోజులు దాటినా ఎదగని పత్తి
- బావుల్లోనూ నీటికి కటకటే


విత్తనాలు నాటి ఇరవై రోజులు దాటినా సక్రమంగా మొలకెత్తని పత్తి పంట

సుల్తానాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలతో రైతులు సాగు పనులు మొదలుపెట్టారు. జూన్‌లో అడపాదడపా వర్షాలు కురవడంతో అన్నదాతలు ఆనందంగా సాగు పనులు ప్రారంభించారు. నెల రోజులు కావస్తున్నా వానల ఊసే లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోహిణి కార్తె ఆరంభంలోనే నార్లు పోయగా ముదిరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు పనులు ఆలస్యం కావడంతో దాని ప్రభావం పంటల దిగుబడుల పై కూడా పడుతాయని రైతులు అంటున్నారు. సుల్తానాబాద్ మండంలోని చాలా గ్రామాలలో రైతులు నార్లు పోసుకుని వానల కోసం ఎదురు చూస్తున్నారు. జూన్ మూడో వారంలో వానలు కురిస్తే సీజన్ సకాలంలో ప్రారంభం అయ్యేదని, ఇప్పటికీ వానలు కురవక పోవడంతో సీజన్ అయోమయంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

● ఎదగని మొక్కలు:

మండలంలోని రేగడి మద్దికుంట, అల్లీపూర్, మల్లయ్యపల్లి, రామునిపల్లి, కనుకుల, సుద్దాల, కొదురుపాక, నారాయణపూర్, దేవునిపల్లి, తదితర గ్రామాలలో రైతులు ఎక్కువగా పత్తి పండిస్తారు. ఈసారి నెల రోజుల క్రితమే పత్తి విత్తనాలు వేసుకున్నారు. ఒక్కొక్క రైతు కౌలుకు తీసుకుని మరీ పత్తి సాగు చేస్తున్నారు. కానీ వర్షాలు కురవక పోవడంతో చాలా విత్తనాలు మొలవనే లేదు. ఎండ వేడికి భూమిలోపలే అవి మాడి పోయాయని రైతులు అంటున్నారు. కొన్ని చోట్ల చేనులో అక్కడక్కడ మాత్రమే మొక్కలు వచ్చాయి.

అంతర పంటగా కంది

లక్ష్మి, రైతు



పత్తిలో అంతర పంటగా కంది పంట సాగు చేయాలని ఎంచు కున్నాం. ఈ నెలలో వానలు కరు స్తాయని సాగు పనులు ప్రారంభిస్తే అసలు వర్షాల జాడే లేకుండా పోయింది. అయినా ఆశతో ఈ పత్తి చేనులోనే అంతర పంటగా కంది విత్తనాలను విత్తుకుంటున్నాం.

ప్రభుత్వం ఆదుకోవాలి: గోపిడి ప్రభాకర్ రెడ్డి, రైతు, రేగడిమద్దికుంట



నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంట వేస్తే మొలవనే లేదు. నెల రోజులు కావస్తున్నా వానలు లేవు. నాలుగు ఎకరాలకు విత్తనాలు. కూలీలకు ఇరవై వేలు నష్టపోయాను. చాలా మంది రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి.

మళ్లీ విత్తనాలు వేస్తున్నాం: స్వప్న, ఆక్షయ (తల్లీ కూతుళ్లు)


రామునిపల్లిలో పత్తి మొలవని చోట విత్తనాలు నాటుతున్న తల్లీ కూతుళ్లు

రామునిపల్లి గ్రామంలో కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నాం. నెల రోజుల కిందట పత్తి విత్తనాలు వేశాం. కానీ ఇప్పటికి అవి మొలవలేదు. దాంతో తాము ఎక్కడెక్కడ మొలవలేదో ఆయా చోట్ల మళ్లీ విత్తు కుంటున్నాం. నాలుగైదు రోజులలో వానలు కురవక పోతే పత్తి పంట చేతికి రాదు. దాంతో వరుణ దేవుని కరుణ కోసం ఎదురు చూస్తున్నాం.

విద్యాధికారి కార్యాలయంలో మండల పరిషత్ సేవలు

- విద్యాశాఖకు లేని ఆఫీసు
- పాఠశాల గదిలో ఎంఈవో విధులు
- సిబ్బందికి, ఉపాధ్యాయులకు ఇబ్బందులు
- మండల పరిషత్‌ను ఖాళీ చేయించాలంటున్న విద్యార్థి సంఘాలు


విద్యాధికారి కార్యాలయంలో కొనసాగుతున్న మండల పరిషత్

వీర్నపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టపరిచే విధంగా చర్యలు చేపడుతున్నా.. మారుమూల అటవీ ప్రాంతంలోని వీర్నపల్లిలో ఆచరణకు నోచుకోవడం లేదు.. 2016లో నూతన మండలంగా ఏర్పాటు చేసినా అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలల ఆవరణలో అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ నిధులతో మండల విద్యాధికారి కార్యాలయాన్ని నిర్మించారు.

మండలంగా ఏర్పాటు చేసినా పూర్తిస్థాయి విద్యాధికారి, సిబ్బందిని నియమించక ఉమ్మడి ఎల్లారెడ్డిపేట నుంచే ఇన్‌చార్జి అధికారులు, సిబ్బంది కార్యకలాపాలు నిర్వహించారు. దీంతో విద్యాధికారి కార్యాలయంలో మండల పరిషత్ కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. గత సంవత్సరం ప్రభుత్వం విద్యాశాఖలో పాఠశాలలకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా మండలానికి ఎంఈవోను నియ మించి, సిబ్బందిని కేటాయించారు. కానీ మండల విద్యాధికారి కార్యాలయంలో ఇంకా మండల పరిషత్ సేవలు కొనసాగిస్తున్నారు. దీంతో విద్యాశాఖకు ఆఫీసు కరువైంది.

పాఠశాల గదిలోనే విధులు..

మండల కేంద్రలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని ఓ గదిలో విద్యాశాఖ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. అదే గదిలో ఎంఈవో, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలతో కలిపి 24 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల పనుల పై వచ్చే ఉపాధ్యాయులకు కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందరూ గదిలో ఒకే దగ్గర పనిచేయడంతో ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఉపాధ్యాయులకు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల కేంద్రంలో ఉన్న విద్యాధికారి కార్యాలయాన్ని అప్పగించాలని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

మండల పరిషత్‌ను ఖాళీ చేయాలి..

విద్యాధికారి కార్యాలయంలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయాన్ని ఖాళీ చేయించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. పాఠశాలల ఆవరణలో మండల పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో విద్యార్థుల చదువు అంతరాయం కలుగుతోంది. రాజకీయ నాయకులు, కార్మికులు ధర్నాలు, ఆందోళనల నినాదాలు చేయడంతో విద్యార్థులు సరిగా చదువలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి మండల పరిషత్‌కు పక్కా భవనాన్ని కేటాయించాలని, ఉన్నతాధికారులు మండల విద్యాధికారికి కార్యాలయాన్ని అప్పగించాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలలో ఆఫీసుతో విద్యారులకు ఇబ్బందులు..

జాలపల్లి మనోజ్‌కుమార్, విద్యార్థి నాయకుడు



పాఠశాలలో ఎంఈవో ఆఫీసు ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. విద్యా సమస్యలను తెలిపేందుకు వెళ్లినప్పుడు విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతుంది. ఆఫీసు సరిగా లేక కార్యాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఎంఈవోకు స్వంత భవనాన్ని అప్పగించాలి.

కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుంటాం...

తుమ్మ శ్రీనివాస్, ఎంఈవో, వీర్నపల్లి.



విద్యాధికారి కార్యాలయంలో మండల పరిషత్‌ను తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం పాఠశాలలకు సమీపంలో ఉండటంతో పలువురి ఆందోళనలతో విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

యూరియా కేటాయింపులు తగ్గించడం అన్యాయం

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి లేఖ రాసిన పెద్దపల్లి ఎంపీ

గోదావరిఖని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు అవసరమైన యూరియా మొత్తాన్ని కేటాయించకుండా, ఇతర రాష్ట్రాలకు మళ్లించడం అన్యాయమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మండిపడ్డారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి ఎంపీ లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కోత విధిస్తూ, బీజేపీ పాలిత రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు 30 వేల టన్నుల కేటాయించగా, గత సంవత్సరం 60వేల టన్నులు కేటాయించినట్లు, 45శాతం యూరియా తగ్గించినట్లు తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి చేసిన యూరియా కూడా తెలంగాణకు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలకు తరలించడాన్ని ఖండిస్తున్నట్టు ఎంపీ పేర్కొన్నారు. గతేడాది స్థాయిలో యూరియా కేటాయింపులను వెంటనే పునరుద్ధరించాలని, ఆర్ఎఫ్‌సీఎల్‌లో తయారైన యూరియాను మొదట తెలంగాణకే కేటాయించాలని, రాజకీయ ప్రేరణలకంటే రైతుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఎస్సారార్ కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాల అటానమస్ హోదాలో డిగ్రీ మొట్టమొదటి పూర్తిస్థాయి బ్యాచ్ ఫలితాలు విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆరో సెమిస్టర్‌తో పాటు డిగ్రీ కోర్సు ఉత్తీర్ణులైన వారు 79 శాతం, రెండో సెమిస్టర్‌లో 30 శాతం నాలుగో సెమిస్టర్‌లో 38 శాతం ఉత్తీర్ణత సాధించి నట్లు వివరించారు. ఫలితాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్‌కుమార్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టీజీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు కరుణాకర్, డాక్టర్ మల్లారెడ్డి అకాడమిక్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.


ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి సురేష్‌కుమార్

రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం గడువు పొడిగింపు



గోదావరిఖని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రారంభించిన రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి సివిల్స్ ప్రిలిమ్స్‌లో పాసై మెయిన్స్‌కు హాజరవుతున్న అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల గడువు తేదీ ఈ నెల 7తో ముగియగా ఈ నెల 12వ తేదీ వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అలాగే సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన సింగరేణి ఉద్యోగుల పిల్లలకూ రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు.

ఇదీ నేపథ్యం..

గత ఏడాది రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించారు. గతేడాది 140మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరికి ఒక్కొక్కరికి సింగరేణి సంస్థ లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహక నగదును అందజేసింది. వీరిలో 20మంది మెయిన్స్‌లోనూ పాసై ఇంటర్వ్యూకి ఎంపిక కాగా వారికి కూడా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహకాన్ని అందించింది. ఇదే విధంగా ఈ ఏడాది కూడా తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది.

వినియోగంలోకి పీకే రామయ్యకాలనీ ఆర్వో ప్లాంటు

జ్యోతినగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాలలో నిరుప యోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్లను వినియోగంలో కి తెచ్చేందుకు నగర పాలక సంస్థ ముందుకు వచ్చింది. ఆర్వో ప్లాంట్ల మరమ్మతులకు ఎన్టీపీసీ 5.5 లక్షల రూపాయలను మంజూరు చేసింది. గతంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో పీకే రామ య్యకాలనీ, నర్రశాల పల్లి, సాయి సేవా సమితి తదితర కాలనీలో ఆర్వో ప్లాంట్లను నెలకొల్పారు. ప్లాంట్ల నిర్వహణ విషయంలో సమస్యలు ఎదురవ డంతో మూలనపడ్డాయి. నిధులు విడుదల చేయ డంతో పీకే రామయ్య కాలనీలోని ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేసి బుధవారం వినియోగంలోకి తీసుకు వచ్చారు. మిగతా ప్లాంట్ల మరమ్మతు చేపడుతామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, ఈ ఈ ఖాజా జమీల్ అహ్మద్ తెలిపారు.

జీవన స్థితిగతులపై సర్వే


సర్వే చేస్తున్న జాతీయ గణాంక శాఖ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ ఉద్యోగులు

వేములవాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల జీవన స్థితిగతులను అధ్యయనం చేసే క్రమంలో జాతీయ గణాంక అధికారులు బుధవారం వేములవాడ పట్టణంలో సర్వే ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలు గ్రామాలలో ప్రజల ఉపాధి, స్థితిగతులపై నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా వేములవాడ పట్టణంలో సర్వే ప్రారంభించామని జాతీయ గణాంక అధికారి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తొలుత సాధారణ వివరాలతో సర్వే చేసిన అనంతరం ప్రత్యేక ట్యాబ్ ద్వారా 12 కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి వివరాలను నమోదు చేస్తామన్నారు. ఇందులో కుటుంబ యజమాని పేరు, సభ్యుల వివరాలు, విద్యార్హతలు, వృత్తివిద్యా కోర్సులు, స్వయం ఉపాధి తదితర అంశాలు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ అన్వేష్, మేనేజర్ సంపత్‌రెడ్డి, తహసీల్దార్ విజయ ప్రకాష్‌రావు, ఎంపీఎస్‌వో తిరుపతి, మున్సిపల్ బిల్ కలెక్టర్లు జ్యోతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల కోసం స్పెషల్ సెల్ సభ్యులు

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రాధిక జైస్వాల్

సిరిసిల్ల క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంఘటిత రంగంలోని కార్మికులకు చట్టపరమైన సేవలు అందించడానికి బుధవారం స్పెషల్ సెల్ సభ్యులను నియమించామని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రాధిక జైస్వాల్ తెలిపారు. 2015లో ఏర్పాటుచేసిన ఈ స్పెషల్ సెల్‌లో సభ్యులుగా రిటైర్డ్ లేబర్ అధికారి బలరాం, మానేరు స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్, న్యాయవాది యాటి శ్రీనివాస్, పారాలీగల్ వలంటీర్ దేవేంద్రలను నియమించామని తెలిపారు. వీరు అసంఘటిత రంగంలోని కార్మికులకు కేంద్రీకృత, ప్రభావవంతమైన, చట్టపరమైన సేవలను అందిస్తారని ఆమె తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌కు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీర్నపల్లి మండలం మద్దిమల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఉపాధ్యాయిని స్వరూపను స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు నర్సయ్య, రాంరెడ్డి, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అతివలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీపీఎం రవీందర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాజన్నపేట, నారాయణపూర్ గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. మహిళలకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. స్వయం ఉపాధితో పలు రంగాల్లో రాణిసున్న సంఘం మహిళా సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం మల్లేశం, సీసీలు దేవేందర్, మంగ్యానాయక్, నాగరాజు, సుధాకర్, రమణ, పద్మ, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంచేది ఏబీవీపీ..

ఇల్లంతకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో దేశభక్తిని పెంచేందుకు ఏబీవీపీ కృషి చేస్తుందని నాయకుడు మంద వంశీకృష్ణ పేర్కొన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంఘబాధ్యులు వేణు, ప్రవీణ్, పవన్, చరణ్, అనీల్, మధు, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నవారిని ఓటరుగా నమోదు చేయాలి

ఇల్లంతకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ ఫారూఖ్ సూచించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో బుధవారం బీఎల్‌వోలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు 18 సంవత్సరాలు నిండిన వారందరిని గుర్తించాలని సూచించారు. ఓటర్ జాబితాలో తప్పులు ఉన్నట్లయితే సరిచేయాలన్నారు. మృతుల పేర్లను తొలగించాలని, అప్పగించిన పనులను నిబద్ధతతో చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, మాస్టర్ ట్రైనర్ గుర్రం సందీప్‌రెడ్డిలతో పాటు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సమాజంలో గుర్తింపు..



క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఎస్సై

ఇల్లంతకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్సై సిరిసిల్ల అశోక్ పేర్కొన్నారు. రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు స్థానికుడు గడ్డమీది శ్రీనివాస్ అందించిన క్రీడాదుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఆటల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యం పెరుగుతుందన్నారు. క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. సీనియర్ క్రీడాకారుడు శ్రీనివాస్ ముందుకు వచ్చి దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సామాజిక కార్యక్రమాల ద్వారా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, వైస్‌ప్రిన్సిపాల్ రాజశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయుడు మామిడి శ్రీనివాస్, స్థానికులు గుండ పర్శరాం, బొల్లం రవి, సాయి ప్రసాద్, శేఖర్, అజయ్, అభి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

రుద్రంగి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇందిరాచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సన్‌రైజ్ ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, డాక్టర్ వెంకటేష్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఇప్ప మహేష్, గడ్డం స్వామి, సూర యాదయ్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

రుద్రంగి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారులోని కొత్తపేటకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. విద్యుత్ స్తంభానికి పగుళ్లు చూపి పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం

విద్యార్థినికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుమాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన రామిండ్ల అర్పితకు ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి బుధవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం విద్యార్థిని అర్పితను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, అంజయ్య, శరవింద్, బాబు, రాజిరెడ్డి, బాలయ్య, నాంపల్లి, రమేశ్, గోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు అండగా ఉంటాం..



ఐక్యతను చాటుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వికలాంగులు, వితంతులు, ఒంటరి మహిళలను మొండి చేయి చూపించిందని, వారికి ఎమ్మార్పీఎస్ నాయకత్వంలో అండగా ఉంటామని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ జిల్లా ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. వికలాంగుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్)అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ చెడిమెల శోభరాణి, కోకన్వీనర్లుగా కత్తెరపాక రవీందర్, తలారి సురేష్, చిన్నమనేని పురుషోత్తంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గుండా థామస్, ఆవునూరి ప్రభాకర్ మాట్లాడారు. సమావేశంలో మంగళి చంద్రమౌళి, ఎలగందుల బిక్షపతి, కొమ్ము రాజశేఖర్, బరుకుంట తిరపతి, నరేష్, ప్రశాంత్, నల్లబాబు, తిరుపతి, కర్ణాకర్, సంగీత, రాజవ్వ, దుర్గయ్య, మల్లయ్య, దివ్యాంగులు పాల్గొన్నారు.

పత్తి సాగుపైనే రైతుల ఆసక్తి..



ముస్కానిపేట గ్రామంలో సాగుచేసిన పత్తి

ఇల్లంతకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెల్ల బంగారంగా పిలువబడే పత్తిపంటను సాగుచేయడానికే మండల రైతులు ఆసక్తి కనబర్చారు. గత సంవత్సరంలో మండలంలో 12వేల ఎకరాలలో పతిపంటను సాగు చేయగా ఈసంవత్సరం 12వేల500 ఎకరాలలో పత్తి పంటను సాగుచేసి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. కొన్ని సంవత్సరాలు పత్తిపంట రైతులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేసినా రెండు మూడు సంవత్సరాలుగా పత్తిని సాగుచేసిన రైతులు లాభపడుతున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు పత్తిపంట పూర్తి అయిన తర్వాత మొక్కజొన్న, పొద్దుతిరుగుడులను రెండవ పంటగా పండిస్తుండటం వల్ల ప్రతి సంవత్సరం విస్తీర్ణం పెరుగుతుంది. మండలంలోని ముస్కానిపేట, తాళ్ళపెల్లి, పత్తికుంటపల్లె, కేసన్నపల్లె, జవారిపేట, నర్సక్కపేట, గాలిపెల్లి తదితర గ్రామాలలోని రైతులు పత్తిని ప్రధానంగా సాగుచేస్తుంటారు. తొలకరి వర్షాలు కురియక ముందే ఈసారి పత్తి విత్తనాలు పెట్టిన రైతులు కొంత నష్టపోయారు. పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఒక్కొక్క రైతు మూడు సార్లు విత్తనాలు పెట్టిన వారు ఉన్నారు. దీనితో రైతులకు ఖర్చు ఎక్కువయ్యింది. పత్తి విత్తనాలు పెట్టి 25రోజులు గడిచిపోతుండటం, తరుచు వర్షాలు పడుతుండటంతో చేనులో కలుపుమొక్కలు సైతం బాగా పెరిగాయి. కలుపు మొక్కలను తొలగించడానికి రైతులు దౌరకొడుతున్నారు. కొన్ని గ్రామాలలో పతి చేన్లను రసంపీల్చే పురుగు ఆశించినట్లు రైతులు పేర్కొంటున్నారు. చీడపీడల బారిన పడిని పంటలను కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధిస్తామని పత్తి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్లుగా పత్తి పంటనే సాగు చేస్తున్నా..

- జుట్టు ఆగయ్య, ముస్కానిపేట



పది సంవత్సరాలుగా పత్తిపంటనే సాగు చేస్తున్నాను. ఈసారి నాలుగు ఎకరాల్లో పత్తిపంటను సాగుచేశారు. గతంలో పత్తిపంట సాగుచేయడం వల్ల నష్టం వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితిలేదు. దిగుబడి పెరగడంతో పాటు ధర ఎక్కువ కావడం అయ్యింది. రెండో పంటగా మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను వేస్తుండటం వల్ల రైతులు నష్టపోవడం లేదు. తరచూ చిన్నచిన్న వర్షాలు పడుతుండటం వల్ల చేనులో కలుపు మొక్కలు బాగా పెరిగాయి. ఎకరానికి 13క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

- సురేష్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి



పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడిసాధించవచ్చు. కొన్ని ప్రాంతాల్లో పత్తి చేన్లకు రసంపీల్చే పురుగు ఆశించింది. దీని నివారణకు ఆసిపేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి పిచికారి చేయాలి లేదా తయోమితాక్జామ్ ఒక గ్రామును లీటర్ నీటికి పిచికారి చేసినట్లయితే చీడపీడ నివారణ అవుతుంది. ప్రత్తిసాగు చేస్తున్న రైతులు రెండో పంటకు వెళుతున్నందున రైతులు ఆసక్తి కనబర్చుతున్నారు. వ్యవసాయశాఖ సూచనలు రైతులు పాటించడం ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు.

'సర్దుబాటు'కు కసరత్తు..

(5వ పేజీ తరువాయి..)

200మంది ఉపాధ్యాయులు సర్దుబాటు కానున్నట్లు భావిస్తున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలలో 1-10 మంది విద్యార్థులు ఉంటే ఒక ఉపాధ్యాయుడు, 11-60మంది విద్యార్థుల కు ఇద్దరు ఉపాధ్యాయులు, 121-150 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు, 151-200మంది విద్యార్థులకు ఆరుగురు ఉపాధ్యాయులు, 200 మంది విద్యార్థులు దాటిన పాఠశాలలో ప్రతి 40 మందికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయిస్తారు. 6నుంచి 8వతరగతి వరకు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1-20 విద్యార్థులకు ఒక లాంగ్వేజ్ ఉపాధ్యా యుడు, ఒక నాన్‌లాంగ్వేజ్ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేస్తారు. ఒక పంచాయతీ పరిధిలో టీచర్ల సర్దుబాటు అవసరం లేకుంటే స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సర్దుబాటు చేస్తారు. అక్కడ కూడా అవసరం లేకుంటే మండల పరిధిలో, తర్వాత జిల్లా పరిధిలో సర్దుబాటుకు పరిశీలిస్తారు.

బీజేపీ మండల కార్యవర్గం

వేములవాడ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రూరల్ మండల బీజేపీ కార్యవర్గ సభ్యులను బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆదేశానుసారం వేములవాడ రూరల్ మండలం అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో నియమించారు. మండల ప్రధాన కార్యదర్శులు తోట శేఖర్, వనపర్తి పరశురాములు, ఉపాధ్యక్షులుగా పల్లికొండ నారాయణ, లింగంపల్లి కుంటయ్య, పంచెరుపుల విజయ, గుంటి వంశీకృష్ణ, కార్యదర్శులుగా గుమ్మడి శ్రీనివాస్, చందం కుమార్, పొన్నం మేఘన, మందా రాజేందర్, కోశాధికారిగా ఆవులూరి రమ్య, సోషల్ మీడియా కన్వీనర్ చింతకుంట గౌతమ్‌ను నియమించినట్లు మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ తెలిపారు.

పీఆర్సీ అమలుచేయాలి

కోనరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ వెంటనే అమలుచేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు కోరారు. కోనరావుపేట మండలంలో టీఎస్ యూటీఎఫ్ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. 2023 జూలై 1 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీ ఇప్పటి వరకు అమలు చేయలేదని అన్నారు. వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు గుండమనేని మహేందర్, గాలిపెల్లి సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా చేస్తున్న బీఎల్‌టీయూ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ లేబర్ కోడ్‌లను తీసుకవచ్చే ప్రయత్నాలను రద్దు చేయాలని తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం (బీఎల్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు ముద్రకోల అంజనేయులు డిమాండ్ చేశారు. దేశావ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఎదుట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీడీ కార్మికులతో నాయకులు నిరసన ధర్నా చేపట్టి కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా అంజనేయులు మాటాడారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, తెలంగాణ శ్రామికశక్తి బీడీవర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, రాజిరెడ్డి, సంజీవ్, ప్రసాద్, శంకర్, కనకయ్య, రామచంద్రం, భాస్కర్, శ్రీనివాస్, లక్ష్మీ, ప్రేమలత, పుష్పలత, కవిత, శోభ, లావణ్య, సునిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో భోజన నిర్వాహకులు.. దినసరి కూలీలతో తయారు..



కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా చేస్తున్న బీఎల్‌టీయూ నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక సమ్మెలో మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు బుధవారం వంట చేయలేదు. సమ్మెలో పాల్గొనడంతో ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో దినసరి కూలీలతో భోజనం తయారుచేయించారు. పలు గ్రామాల్లో వంట చేసేందుకు కూలీలు రాలేదు.

అభివృద్ధిని ఓర్వలేక ఆరోపణలు..



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లంతకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అసత్యపు ఆరోపణలు చేస్తున్నాడని పీసీసీ కోఆర్డినేటర్ పాశం రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డిలు పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో 10సంవత్సరాలు ఉన్నప్పుడు పొత్తూరు, గుండ్లపల్లె రోడ్డు పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కేవలం ప్రొసీడింగ్ ఇస్తే సరిపోతుందా, ఆర్థికశాఖ అనుమతి అవసరం లేదా అనిప్రశ్నించారు. ఇప్పుడు నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ డిప్యూటీ సీఎంను కలిస్తే బీఆర్‌ఎస్ నాయకులు బైక్‌ర్యాలీ ఎందుకు పెడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల అవినీతి ప్రజలందరికి తెలుసు అన్నారు. మాజీ ఎమ్మెల్యే చరిత్రను రోజుకో పోస్టర్‌ను ఆవిష్కరించడానికి సిద్ధం అన్నారు. అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే సలహాలు ఇస్తే స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. చేయవలసిన పనులు చేయకుండా హడావిడిగా ప్రొసీడింగులు విడుదల చేయడం మాజీ ఎమ్మెల్యేకు అలవాటు అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తే ఊరుకునేదిలేదన్నారు. కమీషన్లు తీసుకున్న చరిత్ర ఎవరిదో ప్రజలకు తెలుసున్నారు. ఈసందర్భంగా రాసలీల రసమయి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ ప్రసాద్, నాయకులు మామిడి రాజు, ఒగ్గు రమేష్, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గొడుగు నర్సయ్య, మామిడి నరేష్, ఎలుక స్వామి, కూనబోయిన బాలరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌ను బదనాం చేయడమే పని..

సిరిసిల్ల టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను బదనాం చేయడమే పనిగా పెట్టుకున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి, బండి సంజయ్‌కి కేంద్ర సహాయ మంత్రిగా యాక్సిడెంటల్‌గా ఆ పదవులు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఈ ఇద్దరికి ప్రజా సమస్యలపై కనీస పరిజ్ఞానం లేదని కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుల ను విమర్శించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలన చేతగాక బూతులకు కేరాఫ్ అడ్రస్‌గా మారాడని, అదే తరహాలో బండి సంజయ్ వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. పది సంవత్సరాల కాలంలో కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపారని, జాతీయ స్థాయిలో గుర్తుంపు పొందిన కేటీఆర్, హరీష్‌రావులను ఇద్దరు విమర్శించడమే పనిగా పెటుకున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో పనిచేస్తున్న ఏ ఒక్క నాయకుడికి ప్రజా సమస్యలపై పట్టింపులేదన్నారు. డబ్బు సంచులతో టీపీసీసీ అధ్యక్ష పదవితో పాటు ముఖ్యమంత్రి పదవిని కొన్నాడని ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో అధికారం చేపట్టి ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెడుతూ పొద్దుగడుపుతున్నాడని రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతు సమస్యలపై చర్చకు రమ్మని కేసీఆర్, కేటీఆర్‌లకు సవాలు విసిరిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పారిపోయాడని ఎద్దేవా చేశారు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ సీతక్క నియోజకవర్గం అభివృద్ధికి ఎన్నో నిధులను మంజూరు చేస్తే కేటీఆర్‌పై సీతక్క విమర్శలు చేయడం అక్కడి ప్రజలు చూస్తున్నారని త్వరలో ప్రజలు ముగింపు పలుకుతారన్నారు. మంత్రులతో పాటు బచ్చా కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డికి వత్తాసు పలుకుతూ కేసీఆర్ కేటీఆర్‌లపై ఇష్టానుసారంగా మాట్లాడుతే ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, కుంభాల మల్లారెడ్డి, బండ నర్సయ్య, చంద్రయ్యగౌడ్, గడ్డం భాస్కర్, కంచర్ల రవిగౌడ్, సాయికిరణ్, ఆఫోజ్, అజ్జు, జోషల్ పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయం వద్ద భక్తుల సందడి



సిరిసిల్లలో బోనాలు తీసుకెళుతున్న మహిళలు



పోచమ్మ దేవాలయం వద్ద భక్తులు

సిరిసిల్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అషాఢ మాసం బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోచమ్మ దేవాలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. మహిళలు సిరిసిల్లలోని వివిధ ప్రాంతాల నుంచి బోనాలను డప్పుచప్పుళ్లతో తీసుకువచ్చి పోచమ్మ తల్లీకి సమర్పించుకున్నారు. దేవాలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆర్యవైశ్య సంఘంతో పాటు వార్డుల్లో వివిధ మహిళా సంఘాల ఆధ్వర్యంలో బోనాలు సమర్పించుకునారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల పట్టణంలోని 34వవార్డు బీవైనగర్‌లో బుధవారం పోచమ్మ బోనాల పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మాజీ కౌన్సిలర్ దార్ల కీర్తనసందీప్‌ల ఆధ్వర్యంలో మహిళలు పోచమ్మ పండుగ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకుని ఒగ్గుడోలు, డప్పుచప్పుళ్లలతో ఊరేంగిపుగా దేవాలయాన్ని చేరుకుని నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : జిల్లా కేంద్రంలో బుధవారం ఘనంగా పోచమ్మ బోనాలను నిర్వహించారు. స్థానిక వెంకంపేట మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాలను తీశారు. మాజీ కౌన్సిలర్ దార్ల కీర్తనసందీప్, సంఘం కార్యవర్గ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు కల్లూరి రాజు, దార్ల సందీప్, గుండ్లపెల్లి పూర్ణచందర్ నాయకులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం మహంకాళామ్మకు బోనాలు తీశారు. సంఘం పెద్దలు, చిన్నలు, మహిళలు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బీవైనగర్‌లో పోచమ్మ బోనాలతో మహిళలు..



గంభీరావుపేటలో..

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కోనరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని ఏపీఎం రాకేష్ అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో 41 గ్రామ సమైక్య సంఘాలతో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి ఇందిరా మహిళా శక్తి సంబరాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు శ్రీదేవి, జనార్ధన్, బాలరాజు, శోభారాణి, వరలక్ష్మి, మహిళా సంఘం నాయకురాలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

కోనరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అందజేశారు. మల్కపేట గ్రామానికి చెందిన సాధుపల్లి కళ్యాణ్‌కు 60 వేలు మంజూరు కాగా లబ్ధిదారులకు అందజేశారు. కుంట శీను, బోయిని దేవరాజు, కార్తీక్, వినయ్, అనిల్ ఉన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

కోనరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను బుధవారం నిర్వహించారు. జెండా ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. పూజ, కార్తీక్, బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ, ముష్ణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

కోనరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూరులో పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళాన్ని అందజేశారు. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన నంకినేని సురేఖ, విష్ణు, ప్రసాద్ రావు, కీర్తిశేషులు రాజేశ్వరరావు జ్ఞాపకార్థం రూ. 300116 రూపాయలను అందజేశారు. సందర్భంగా ఆలయ పునర్నిర్మాణానికి పెద్దఎత్తున విరాళం ఇవ్వడంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో గోరింటాకు సంబరాలు

గంభీరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) :గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆషాడ గోరింటాకు సంబరాలను బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అంజనేయులు, టాస్క్ కన్వీనర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, అధ్యాపకులు ఆదివిష్ణు, డాక్టర్ బిక్షమయ్య, మనోహర్, శ్రీనివాస్, మహేష్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

సమ్మెలో పాల్గొన్న గ్రామపంచాయతీ సిబ్బంది

ఇల్లంతకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. ప్రతిరోజు ఉదయం పారిశుధ్య పనులకు వచ్చే కార్మికులు బుధవారం ఎవరు విధులకు హాజరు కాలేదు. పలు గ్రామాల కార్మికులు సిరిసిల్లలో జరిగిన ర్యాలీకి వెళ్లారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికుల హక్కులను కాలరాయవద్దని సూచించారు.